## అవనిపై అవతరించిన

# అభ్యుదయ భావనాత్మక పద్య పరమేష్టి

- నండూరి రామకృష్ణమాచార్య మహాకవి -

మా గురువు గారు - స్వర్గీయ డా. నండూరి రామకృష్ణమాచార్యులు గారు సాహిత్య లోకంలో బహుళ ప్రసిద్ధి చెందిన మహాకవి. వీరు రచించిన 'శీర్ణ మేఖల' ఖండ కావ్యం డెబ్బయ్యేళ్ళ క్రితం ఒక సంచలనాన్ని సృష్టించింది. అందులోని కర్ణ, సుయోధన మైత్రికి సంబంధించిన ఘట్టం వీరి స్వీయ కల్పితం. ఈనాటికీ అది ఒక అపురూపమైన సృజనగా నీరాజనాలను అందుకొంటూనే ఉంది. 'అజ్ఞాత కౌంతేయం' మరొక విశిష్ట రచన.

మహాకవి 'కరుణశ్రీ' గారు, నండూరి వారు - ఆత్మీయ మిత్రులు. 'కరుణశ్రీ' గారి గ్రంథాలన్నిటికీ 'నండూరి' వారే పీఠికలు వ్రాసారు. కరుణశ్రీ గారు - కుంతీదేవి బాల కర్ణ విసర్జనను హృదయ విదారకంగా చిత్రిస్తే .. 'అజ్ఞాత కౌంతేయం' ఖండ కావ్యంలో నండూరి వారు - బహు కాలానంతరం ఆ మాతా పుత్రుల పునర్దర్శన సన్నివేశాన్ని హృదయంగమంగా కళ్ళకు కట్టారు. 'ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః' అన్న ఖండిక - ఆనాటి 'హిరోషిమా నాగసాకి' బాంబు దాడికి కలత చెంది నండూరి వారు రచించిన అద్భుత శాంతి సందేశ రచన. ఏడు దశాబ్దాల తరువాత ఇప్పుడు కూడ ఆధిపత్య ధోరణితో వివిధ దేశాలమధ్య జరుగుతున్న దాడుల ఫలితాలు యావత్ప్రపంచానికే కష్ట నష్టాలను తెచ్చిపెడుతున్న వేళ - ఈ కవిత ఈనాటికీ నిత్య సందేశ దీపికగా ప్రకాశిస్తున్నది. ఇటువంటి కవితా సుమాలతో కట్టిన ఈ 'తారా తోరణం' గ్రంథం .. కాలానికి ఎదురీదుతూ ఆంధ్ర సాహితీ నందనవనంలో శాశ్వతంగా నిలిచిన కవితా కల్పవృక్షంగా భాసిల్లుతున్నది.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు, పింగళి లక్ష్మీకాంతం గారు వంటి మహామహుల శిష్యులైన నండూరి రామకృష్ణమాచార్య సుకవి 'ఆంధ్ర విశ్వకళాపరిషత్తు'లో ఎం.ఏ. (తెలుగు) చేసి, 'మైసూరు విశ్వవిద్యాలయం' నుండి తెలుగు సాహిత్యంలో పి.హెచ్.డి. పట్టాను అందుకొన్నారు. అనంతరం .. భీమవరం, అనంతపురం, చిత్తూరు కళాశాలల్లో తెలుగు శాఖాధిపతిగా పనిచేశారు. పిమ్మట తాడేపల్లిగూడెం, విశాఖపట్నం, చీరాల కళాశాలల్లో ప్రాచార్యులుగా పనిచేశారు. పదవీ విరమణ తరువాత, 'తిరుమల తిరుపతి దేవస్థానం' వారి పుస్తక ప్రచురణ విభాగంలో సంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. వీరి రచనలలో 'తారా తోరణం', 'ఆలోచనం', 'ప్రగతి గీత', 'కవితా ప్రభాస','ముత్యాల గొడుగు', 'కచ్ఛపీ కింకిణీకం' వంటి కవితా సంపుటులు; 'శివాజీ', 'ధర్మ చక్రం', 'జ్యోత్స్నాభిసారిక', 'గోదావరి' వంటి నాటికలు; 'కావ్యాలోకం' అనే లక్షణ గ్రంథం; 'కవిత్రయం', 'పద్య శిల్పం' వంటి విమర్శన గ్రంథాలు ప్రముఖమైనవి. ఇవి గాక ఆంగ్లంలో

'The Maha Bharata', 'Gandhian Era' ప్రసిద్ధ రచనలు. 1955 లో ఆచార్యుల వారు రచించిన 'కవిత్రయం' గ్రంథానికి - అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో - 'తెలుగు భాషా సమితి' పురస్కారాన్ని ఆనాటి ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా అందుకొన్నారు. 'కేంద్ర సాహిత్య అకాడమి' 1955 ప్రాంతంలో వీరితోబాటు 'జాషువ', 'కరుణశ్రీ' లను 'నవ్య సంప్రదాయ కవులు'గా గుర్తించింది. ఆ తరువాత, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో నందమూరి తారక రామారావు గారి ప్రభుత్వంలో - 'అధికార భాషా సంఘం' అధ్యక్షులుగా (1987- 1990) పని చేసారు. నండూరి వారు రచించిన 'Gandhian Era' అన్న గ్రంథానికి నాటి రాష్ట్రపతి డా. శంకరదయాళ్ శర్మ 'ముందు మాట' ను వ్రాసారు. ఇటువంటి బృహద్రచనలతో .. పద్యాన్ని ఆధునిక శైలిలో, ఆధునిక భావాలతో, ఆధునిక సమాజ హితంగా రచించిన ద్రష్ట - నండూరి రామకృష్ణమాచార్యులు గారు ఆధునిక యుగంలో 'నడిచే పద్యం'గా ప్రఖ్యాతి వహించారు.

జీవనోత్తర దశలో నండూరి రామకృష్ణమాచార్యుల వారు వేలాది ఆటవెలది పద్యాలలో సరళ సుందరమైన భాషలో సమకాలీన సామాజికాంశాలను స్పృశిస్తూ, పండిత పామరులందరినీ ఆకట్టుకొని, "అభి వేమన" గా సకల జనుల మన్ననలు పొందారు. సుమారు 4000 ఆటవెలది పద్యాలతో రూపొందించిన "ఆలోచనము" అన్న గ్రంథానికి గాను, ఆచార్యుల వారు 2000 సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి 'పద్యకవితా పురస్కారా'న్ని అందుకొన్నారు. అంతే కాకుండా, నండూరి వారు 'ఆంధ్ర పద్య కవితా సదస్సు' రాష్ట్ర స్థాయి అధ్యక్షులుగా తన జీవితంలో చివరి రెండు దశాబ్దాలకు పైగా .. అసమానమైన దీక్షా దక్షతలతో ... ఆమరణాంతం (6 జూలై 2003), పద్య కవితా పునరుజ్జీవనం కోసమై విశేష కృషిని సలిపారు.

మహాకవి కీ.శే. డా. నండూరి రామకృష్ణమాచార్య జయంత్యుత్సవాలను ప్రతియేటా ఘనంగా నిర్వహించడంతోబాటు, వారి సాహిత్య వైభవాన్ని భావి తరాలకు అందించే సదాశయంతో ఏర్పడ్డ మా 'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం' - 2003 నుండి కృషి చేస్తున్న విషయం సర్వజన విదితమే. 2003లో నండూరి వారి సాహిత్యానుశీలన సదస్సును నిర్వహించాం. అనేక సంవత్సరాలుగా విద్యార్థులలో నండూరి వారి పద్యాల పట్ల ఆసక్తిని కలిగేందుకు గాను పద్యపఠన పోటీలను నిర్వహించాము. అందుకు ఉపయుక్తంగా ఉండే విధంగా ప్రముఖ అవధాని డా. ఆశావాది ప్రకాశరావుగారి కూర్పుతో కీ.శే. నండూరి శోభనాద్రిగారు 'నడిచే పద్యం నండూరి' అన్న చిన్న పుస్తకాన్ని ముద్రించడం జరిగింది. ఆ పుస్తకాన్ని ఎప్పటికప్పుడు తగిన మార్పులతో శ్రీ నండూరి గోవింద రాజు గారు అనేక పునర్ముద్రణలు చేసి, జన బాహుళ్యానికి ఉచితంగా అందిస్తూ ఉండడం ముదావహం. వారికి మా సంస్థ పక్షాన ధన్య వాదాలను తెలియజేసుకొంటున్నాం. అంతే కాకుండా ప్రతి సంవత్సరం పద్యకవిత్వ సంబంధంగా విశేష కృషి చేసిన లబ్ధ ప్రతిష్ట సాహితీ మూర్తులకు నండూరి వారి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తూ ఉన్నాం.

ఈ 'సాహిత్య పీఠం' ప్రస్థానంలో భాగంగా .. 29 ఏప్రిల్ 1921 నాడు ఆంధ్ర దేశంలోని పశ్చిమ గోదావరి జిల్లాలోని గణపవరంలో జన్మించిన మహాకవి నండూరి రామకృష్ణమాచార్యులు గారి 'శత జయంతి మహోత్సవా'న్ని (2021- 2022 లో 'కోవిడ్' ఆటంకం కారణంగా) 2023 లో హైదరాబాదు నాంపల్లిలో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రెండురోజుల పాటు వైభవంగా నిర్వహించుకొన్నాం. ఎన్నో ఏళ్ళుగా రామకృష్ణమాచార్యుల వారి అభిమానులు కోరుతున్నందున, ఈ 'తారాతోరణం' గ్రంథాన్ని, ఆ శతజయంతి విశేషాలను కూడ చేరుస్తూ, ఇప్పుడు పునర్ముద్రిస్తున్నందుకు చాల ఆనందంగా ఉంది. మా 'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం' నిర్వహించే అన్ని కార్యక్రమాలకు - విశేష సహకారాన్ని అందిస్తూ మార్గదర్శనం చేస్తున్న వారు మా సంస్థ అధ్యక్షులు శ్రీ కళ్ళేపు సాగరరావు గారు. అట్లాగే మా కార్యక్రమాల నిర్వహణలో డా॥ నండూరి రామకృష్ణమాచార్యుల వారి కుటుంబ సభ్యులంతా.. ముఖ్యంగా శ్రీ ఆత్మకూరి గాంధీ, కీ.శే. నండూరి శోభనాద్రి (2013 వరకు), నండూరి గోవిందరాజు, డా. నండూరి విద్యారణ్యస్వామి, నండూరి వేదవ్యాస చక్రవర్తి గార్లు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం అనన్య సామాన్యం. వారందరికి మా సంస్థ పక్షాన ప్రణామాలను సమర్పించుకొంటున్నాను. మా గురువుగారు నండూరి వారి జయంత్యుత్సవాల నిర్వహణలో మాకు సహృదయతతో సహకరిస్తున్న నవ్యసాహితీ సమితి 'కార్య నిర్వాహక అధ్యక్షులు' శ్రీ వేమరాజు విజయకుమార్ గారికి కూడ మా హార్దిక కృతజ్ఞతలు. ఈ పుస్తకాన్ని చదివి ఆనందించి, ఈ తరం సాహిత్యాభిమానులు అందరికీ అందించి, నండూరి రామకృష్ణమాచార్యుల వారి సాహిత్య ప్రచారంలో పునీతం కావలసిందిగా వారి శిష్య పరమాణువుగా నేను ప్రార్థిస్తున్నాను.

(ది. 7 ఏప్రిల్ 2026)

డా. ఆచార్య ఫణీంద్ర

ప్రధాన కార్యదర్శి

'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం'

# పద్య నివాళి

***01.డా. ఆచార్య ఫణీంద్ర*** "నీకు శిష్యుడన్న ఒకే పతాక చాలు ... "

ఎవ్వాని భావాల కివ్వేళయే గాక
భావియున్ తల వంచి ప్రణతు లిడును -
ఎవ్వాని కావ్యాల నిముడగా వస్తువై
ధరణిలో అణువణ్వు తపన పడును -
ఎవ్వాని మాటయే ఇలలోన చాటువై
నరుల నాల్కల పైన నాట్య మాడు -
ఎవ్వాని కీర్తి మహీ మండలమ్ముపై
దశ దిశాంతమ్ములన్ దాటి సాగు -

అట్టి నండూరి వంశార్ణ వైక సోమ!
రామకృష్ణమాచార్య సన్నామధేయ!
నీకు శిష్యుడన్న ఒకే పతాక చాలు -
ఎత్తి నడయాడి లోకాల నేలుకొనగ!

కువలయమున నున్న కుటిల నీతిని ఎత్తి,
కుండ బ్రద్దలట్లు కొట్టి చూపి,
అభ్యుదయ పథమ్ము 'నాలోచనము' పేర
వెలయ జేసితి 'వధి వేమ'నగుచు!

ఎలమి డెబ్బదేండ్లకు పైన ఏకధాటి
పద్య రత్నముల్ సృజియించి ప్రణుతి కెక్కి
నట్టి 'నండూరి రామ కృష్ణా'ఖ్య సుకవి!
మహిని పద్యమ్మునకు నీవు మారు పేరు!

అతుల కవీశ్వరా! సుకవితాంబకు ముద్దుల పట్టి! పండిత
స్తుత ఘన సాహితీ కుసుమ శోభన వాటిక యందు మేటి క
ల్ప తరువునై, సుధా రస మపారము చిప్పిలు పద్య సత్ఫలాల్
శతము లొసంగితో! పలుకు శాసనమౌ గురుదేవ! మ్రొక్కెదన్!

ప్రేమగ కవితాప్రభాస పేరిడిన ఘనున్

సామాన్యుని నాలుకపై

తేమగ కవితను నిలిపిన ధీమతి నెంతున్ !!

నిత్యము గొనియాడుచు-నౌ

చిత్యముతో గొలుచు నమరజీవుల కొరకై

ముత్యాల గొడుగు పట్టిన

స్తుత్యుని గొనియాడుచుంటి శోభిత మూర్తిన్ !!

అల గోదావరి తటిలో

కలలో జ్యోత్స్నాభిసారికలతో సతమున్

పలురీతులుగా చర్చలు

సలిపిన భావుకుని ధర్మచక్రము నెంతున్ !!

కారణ జన్ముండు మహా

వీరశివాజీ చరితను ప్రియమగు రీతిన్

ధీరోదాత్తముగ నుడివి

కీరితితో వెలుగు రామకృష్ణుని దలతున్ !!

తిరుమల వాసుని దయతో

పరిపరి విధముల కృతులను పరిరక్షింపన్

తిరుపతి ప్రచురణ లందున

కరసేవ నొనర్చినట్టి కవివరు నెంతున్ !!

వర'పుష్పవిలాపము'తో

కరుణను జిలికించినట్టి కవితిలకుండౌ

కరుణశ్రీ మిత్రుండై

వరలిన విఖ్యాత కవికి వందన మిడెదన్ !!

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~02
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

*****03.డా. వెనిగళ్ళ రాంబాబు*****

## "సామ్యవాద మహర్షి !"

నండూరి రామకృష్ణులు
పండిత ప్రాచార్యవరులు ! పద్య కవీంద్రుల్ !
నిండెను యశస్సు తారా
మండలమే ! నోటి వాక్కు మంగళకరమే !!

అమరులౌ స్వాతంత్ర్య సమర యోధుల వంశ
సంజాతమా ! మిమ్ము సన్నుతింతు !
సంస్కృతాంధ్ర వధాన శక్తి పీఠము మీరు !
ఆచార్య ధీవరా ! అంజలింతు !
అద్వితీయమ్ము మీ ఆంగ్ల వైదుష్యమ్ము !
సంస్కార రసధునీ ! సన్నుతింతు !
భాష్యకార్లను మించు శిష్య సంతతి మీది !
అధ్యాపకోత్తమా ! అంజలింతు !

స్వర్ణ సౌజన్య శిఖరమా ! సన్నుతింతు !
సౌమ్య సామ్యవాద మహర్షి ! సన్నుతింతు !
ఆత్మ యోగీ ! విరాగి ! మీకంజలింతు !
అరుణకిరణాల చరణాలకంజలింతు !!

మార్చవచ్చును ఊర్లు ! మార్చవచ్చును కార్లు !
మార్చరాదన్నారు మాన్య సతిని !
ఆడంబరమె కాని ఆశు కవిత్వమ్ము
సరసు కాదన్నారు స్నానమాడ !
మరణమైనను గాని ధరణిని మంగళా
శాసనమన్నారు సాహసించి !
జ్ఞాన దీప్తిని పంచు మానవత్వము చాలు
మరచిపొమ్మన్నారు మతము నైన !

వేద వాఙ్మయమ్ము, వేమన్న వాదమ్ము,
కొంత హేతువాద చింతనమ్ము
హాస్య చతురత లనవశ్యమ్ము సంధించు
వ్యాస ! శతజయంతి వందనమ్ము !! #

*** 04.మరుమాముల దత్తాత్రేయ శర్మ***                "నడిచే పద్యము నందూరి"

సూర్యుడవై శుభంకర సుశోభల కావ్యపు కాంతులీను వా
గ్గుర్యుడవై రసోచిత మధూదయ వాఙ్మయ రాశివోసి సౌం
దర్యము గూర్చి భారతికి ; తన్మయమొందిన రామకృష్ణమా
చార్య! త్వదీయ పద్యములు చాలును మ్రోగగ తెల్గు గుండియల్ !

మంచి మనస్సు; మాధ్వీక సమంబు వచస్సు; సితాంబుజాత ర
మ్యాంచితమౌ యశస్సు; దరహాస విభాసితమౌ మహస్సు; శో
భించిన మీ వయస్సు ; కవితేందిర మెచ్చ కవిత్వ శీధు వం
దించిన మీ తపస్సునకు హృజ్జనితాదర భక్తి మ్రొక్కెదన్ !

ఎవ్వాని పద్యమ్ము రవ్వలై రాజిల్లి
    ఆంధ్ర వాఙ్మయ శోభలవని నిలిపె !
ఎవ్వాని సౌహృద మెంతేని రాణించి
    పాండితీలోక ప్రభాసమయ్యె !
ఎవ్వాని రస కృతుల్ ఏపార చదివిన
    కచ్ఛపీ కింకిణీ కళల నీనె !
ఎవ్వాని సరసోక్తి పువ్వులై విరబూసి
    ఆలోచనా లోచనమ్ములయ్యె!

అతడు నందూరి రామకృష్ణాఖ్య సుకవి !
ఆత డాచార్య వర్యుడై జోత లంది,
సుకవి బృంద బృందారక శోభ నలరె !
పద్యమన్నను ప్రాణమై బ్రతుకు నిచ్చె !

మీ కవితామృత ధారల
లోకము సుశ్లోక మయ్యె ! లోపలి వ్యథలున్
తోకలు ముడిచెన్; కనుకనె
నాకము మిము పిలిచెనేమొ నందూరి కవీ !

వడివడిగ సుడులు సుడులుగ
గడబిడ గలిగించు ఆంధ్ర కంటక తతికిన్
వడిగ కుఠారమ వైతివె
నడిచెడు పద్యమ్ము వగుచు నండూరి కవీ! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~04

## ***05."కవిమిత్ర" వి.వి. సత్యప్రసాద్*** "తెలుగు వారి అభిమానకవి"

కం: నండూరి కృష్ణ మార్యులు
మెండైన కవిత్వమందు మెరసిన ఘనులై,
కొండంత కీర్తి వడసి, య
ఖండముగా తెలుగు వారి ఘనతను నిలిపెన్!

సీ; 'ఆలోచనము"నందు ఆటవెలది వ్రాసి,
సుకుమారశైలిని చూపెనతడు
ప్రౌఢమౌ పద్యాలు గాఢమై నిలచె, "తా
రాతోరణము"నందు రమ్య కవిత,
బిందుసారుని నాటి ప్రేమ గాథను తెచ్చె
"ధర్మచక్రం"బునం దతిశయించె,
ఉత్తమోత్తమమైన "జ్యోత్స్నాభిసారిక"
స్వచ్ఛమౌ ప్రణయ తత్త్వమ్ము తెలిపె!

తే.గీ: నృత్య నాటిక "గోదావరి" ని రచించె!
సత్యమగు మాట"శ్రమయేవ జయతె" వ్రాసె!
రేడియో నాటిక లవేవి లెక్క లేదు!
ప్రతి పదంబున రసవైభవంబు నిలిపె!!

సీ:: ఆంగ్లంబునందు "మహాభారతము" వ్రాసి
పశ్చిమంబున మన ప్రతిభ చాటె!
'గాంధీ తరమ్ము"ను కమ్ర రీతిని ఆంగ్ల
మందురచించి ఆనందపరచె!
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

సీ. రచియించినారు తారాతోరణమ్ము నా -
లోచనమ్మును కవులు నుతియింప,
ప్రగతి గీతరచించి ప్రఖ్యాతి గనినారు,
ధర రచించిరి కవితాప్రభాస.
ముత్యాల గొడుగును ముచ్చటగావ్రాసె,
కచ్ఛపీకింకిణీకంబు వ్రాసె,
జ్యోత్స్నాభిసారికన్ ద్యోతకంబుగ వ్రాసె,
ధర్మచక్రము వ్రాసె ధాత్రి మెచ్చ,

తే.గీ. ఘనత నొప్ప కావ్యాలోకనను, శివాజి,.
వ్రాసె గోదావరిని,.గాంధి వాసికెక్క,
వర కవిత్రయ పద్యశిల్పంబువ్రాసె,
రమ్యమౌ మహాభారత్ వరలగ వ్రాసె.

శా. ధారాపాత సుధాస్రవంతి కవితల్, తత్వంబుతో నొప్పచున్
చేరన్ సజ్జనపాళికెల్ల, ఘన రాశీభూత దివ్యార్థముల్
పారున్ మానస వీధులందు, కవనోద్భాసంబు వర్ణింపగా
లేరెవ్వారలు, రామకృష్ణ కవితన్ క్లేశంబె కన్పించదే.

తే.గీ. శతజయంతీ మహోత్సవ సమయమందు
రామకృష్ణమాచార్యు సుధామునకును
శ్రద్ధతోనంజలించెద చక్కగాను,
వందనంబు చేసెద నందరికిని. #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~07

## ***08.కుంతి (కౌండిన్య తిలక్)*** నందూరి కృష్ణమార్యునికి పద్య నీరాజనం!

కం. నిండైన సాధు శీలా!
పండిత శ్రేష్ఠా!సుమధుర పద్య సు కవితా
భండన భీమా!మద్గురు
నందూరి కవీశ్వర! శత నతులను గొనుమా!
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

విశ్వనాథార్యుల వినయంపు శిష్యులై,

సాహితీ సేద్యము జరిపినారు!

'రస రాజధానిలో' రాత్రి పగలనక,

కావ్యగోష్టుల జన్మ గడపి నారు!

పదవులు బిరుదులు పర్వెత్తి మిమ్ముల,

కౌగలించె కనగ కనుల పంట!

తేటగీతి: పుత్ర ప్రేమల శిష్యుల ప్రోత్సహించి,

వారసత్వ సంపదలను వసుధ కిడిరి!

వందన శతము నందూరి వంశజునకు!

రామ కృష్ణమాచార్య వరా! నమోస్తు! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~09

## ***10.గొడవర్తి సంధ్య*** "నందూరి వారికి అక్షర నివాళి"

ఉ. పుణ్యము సేసెనేమొ ముును, పొల్తుక "వెంగమ" భవ్య కీర్తితో

గణ్యత గాంచు పుత్రునిగ కన్నది! తండ్రిగ "శోభనాద్రి"యున్

మాన్యత నొందె! "తత్ఫలితమా!" యన నీవయి కావ్యకర్త గాన్ -

ధన్యత పొందె నాంధ్ర కవితాఢ్యుల వ్రాతము "రామకృష్ణయా"!

చం. కవి వృషభా! నమస్సులివె - కావ్య విపంచిక తానె వచ్చి, క

మ్ర వరము లీయగాన్ - ఘన మరాళ విహారిణి కీవు పద్యమి

చ్చు వరము నొందినాడవు! సుశోభిత శిష్య ప్రశిష్య బృందమే

అవిరళమౌచు వ్యాప్తి గొనె నాంధ్ర కవిత్వ ప్రపంచమందునన్!

చం. తలుపుల మీద పద్యముల - ధామమునన్ లిఖియింప జేసి, నీ

తలపుల లోన నిల్పుచు సుధారస పూర్ణములైన కావ్యముల్ -

అల "కవితాప్రభాస" యను నా గృహ సీమకు స్వాగతం బటన్

పిలిచితొ వాక్సతీమణిని ప్రేమము, భక్తియు మీర మ్రొక్కుచున్!
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

చం. తమ మది యెంతొ మెత్తన! కృత ప్రతి పద్యము నంత కంటెయున్!
తమ ప్రియ శిష్యులన్న నెడదం గల ప్రేమము మెత్త మెత్తనౌ!
తమ గురువైన సత్కవి, సదాశయ పూర్ణుడు - "విశ్వనాథ" పై
విమల సుభక్తి జూపితివి వెండియు మెత్తనయౌ విధేయతన్! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~10

## ***11.శంభుని కుమార్*** "నండూరి రామకృష్ణ"

తే.గీ. సంస్కృతాంధ్రమాంగ్లాలలో సారమంత
తెలిసి కైతల నద్దిన తీరు గాంచి,
చదువులమ్మయే పులకించె సత్కవీంద్ర!
రామ కృష్ణమాచార్య ! నీరాజనమ్ము!

కం. అనితర సాధ్యమయిన మీ
ఘనమౌ సాహిత్య రాశి ఘనతను చాటెన్!
కన నందు "శీర్ణమేఖల
మను నాచంద్రార్కము నిల మాన్యత గనుచున్!

సీ. పద్య కవిత్వ కల్ప తరువుగా నిల్చి
పద్య పరిమళముల్ పంచితీవు!
క్రొత్త పుంతలు ద్రొక్కు గొప్ప సుకృతులతో
ప్రాజ్ఞుల మెప్పొంది వరలి తీవు!
దీనజనావళి తీరని వ్యధలకు
కన్నీరు గార్చిన కవిత వీవు!
సాహితీ స్రష్టల సరసన వెలిగిన
తెలుగు తల్లి నుదుట తిలక మీవు!

తే.గీ. ఉత్తముడ, వోర్పరివి, మంచి ఒజ్జ వీవు!
బ్రాహ్మి మానస పుత్ర! శ్రీ స్వర్గ ధామ!
సాహితీ జగ న్నాయక! శాశ్వత యశ!
ప్రణతి గొనుమిదే "నండూరి రామకృష్ణ"! #

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~11

ఔత్తరాహ రసార్ద్రహృదయం
దాక్షిణాత్య విదగ్ధమేధా
తవ శుభగళే తరళమంగళ
సూత్రయుగళ దళే

యత్ర భాషణ కరం శుద్ధిః
యత్ర కరుణార్ద్రా నుభూతి:
తత్ర కృపయా సర్వదాస్మాన్
గమయ ప్రియమాతః

యత్ర దాస్యం నాస్తి భావే
యత్ర విశ్వ హితై క దీక్షా
కార్య రూపనిరంతరా స్యాత్;
తత్ర గమయ సదా.

హృద్విధేయా యత్ర ధిషణా
యత్ర హేతుః సంప్రదాయ సు
వర్ణ నిగళక బంధ ముక్తః
తత్ర గమయ సదా

***********

సంగితార్ద్రా మధురసధుని కావ్యలావణ్యపూర్ణా
త్యాగబ్రహ్మప్రగదిత మహాగాన సామ్రాజ్యరాజ్ఞి;
శ్రీమన్నాగార్జున నగ కళాశిల్ప సాహిత్యధాత్రీ
విశ్వాదర్శా విజయతు విశాలాంధ్ర పృద్ధ్వీమతల్లీ .

